నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 2-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:51 పేజీలు: 4 వెల: రూ.1/-

హత్రాస్ హత్యాచార ఘటనపై అట్టుడికిన యూపి

కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనతో సర్వత్రా ఉద్రిక్తత
రాహుల్, ప్రియాంకలను అడ్డుకున్న పోలీసులు
పోలీసులతో ఘర్షణలో కిందపడ్డ రాహుల్
మోడీ తప్ప మరెవ్వరూ నడవకూడదా అంటూ విమర్శలు
యోగీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్న మాయావతి, అఖిలేశ్

లక్నో,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్‌లో చోటుచేసుకున్న హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. మానవ మృగాల చేతిలో హత్యాచారానికి గురై చికిత్స పొందుతూ బాలిక మృతిచెందడం పట్ల విపక్షాలు, మహిళా, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం మహిళల రక్షణ పట్ల తీవ్రంగా విఫలమైందని విమర్శిస్తున్నాయి. తాజాగా ఘటనపై యూపీ కాంగ్రెస్ విభాగం ప్రధాన నగరాల్లో నిరసన చేపట్టింది. మరోవైపు బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, యూపీ బాధ్యురాలు ప్రియాంక గాంధీ, ఎంపీ రాహుల్ గాంధీ హత్రాస్‌కు బయలుదేరగా వారిని మధ్యలోనే నిర్బంధించారు. ఈ సందర్భంగా అక్కడ స్థానిక పోలీసులు 144 సెక్షన్‌ను విధించారు. బాధితురాలి గ్రామం చుట్టు భారీ ఎత్తున బారికేడ్లను ఏర్పాటు చేసి ఎవరినీ లోపలకి అనుమతించ లేదు. రాహుల్, ప్రియాంక రాక సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హత్రాస్‌కు చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసేందుకు వారికి పోలీసు అనుమతి ఇవ్వకపోవడంతో పార్టీ కార్యకర్తలు ధర్నాకు దిగారు. పర్యటనకు వీల్లేదని రాహుల్, ప్రియాంకను రోడ్డుపైనే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొంత హైటెన్షన్ నెలకొంది. తాజా పరిణామాలపై బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలకు కనీస రక్షణ కరువైందని, యోగీని వెంటనే సీఎం పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేసారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని రాష్ట్రపతి పాలన విధించాలని మాయావతి కోరారు. ఢిల్లీ ఆస్పత్రిలో మంగళవారం వేకువజామున తుదిశ్వాస విడిచిన ఆ దళిత యువతి(19)కి అదే రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత హడావుడిగా అంత్యక్రియలు జరిపించింది. ఇప్పటికే ఈ హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతుండగా.. తాజా పరిణామంపై రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దళితురాలు అయినందున బాధితురాలి పట్ల మరణంలోనూ క్రూరంగా వ్యవహరించిందని మండిపడ్డాయి. అర్ధరాత్రి పూట రహస్యంగా అంత్యక్రియలు జరపడం ఏంటని ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. ఈ దశలో హత్రాస్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు రాహుల్, ప్రియాంకలు రాగా వారిని పోలీసులు అడ్డుకున్నారు.

గ్రేటర్ నోయిడా వద్ద రాహుల్, ప్రియాంక గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్రాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి ఢిల్లీ నుంచి బయల్దేరి యమునా హైవే ఎక్స్‌ప్రెస్ వద్దకు వీరి కాన్వాయ్ చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాహుల్, ప్రియాంక నడక ప్రారంభించారు. వారిని అనుసరిస్తూ కార్యకర్తలు, నేతలు కూడా నడక ప్రారంభించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులపై రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో తోపులాటలో రాహుల్ కిందపడ్డారు. రోడ్డుపై కేవలం ప్రధాని నరేంద్ర మోదీయే నడవాలా? సామాన్యులకు నడిచే హక్కులేదా? అని రాహుల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తనను తోసేసి, లాఠీఛార్జ్ కూడా చేశారని ఆయన ఆరోపించారు. తనను పోలీసులు తోసేస్తే కింద పడ్డానని అన్నారు. తాను ఏరకంగా చట్టాన్ని ఉల్లంఘిస్తే అరెస్టు చేశారో చెప్పాలని పోలీసులను నిలదీశారు. తనపై లాఠీచార్జ్ కూడా చేసినట్లు ఆయన ఆరోపించారు. తనను నేలపై పడేసినట్లు రాహుల్ తెలిపారు. యూపీలో మహిళలకు ఏమాత్రం రక్షణ లేదని ప్రియాంక గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. హత్రాస్‌కు 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రేటర్ నోయిడా వద్ద రాహుల్ వాహనాన్ని నిలిపేశారు.

యోగి రాజీనామాకు డిగ్గీ డిమాండ్

ఉత్తరప్రదేశ్‌లో అత్యాచార ఘటనలకు బాధ్యత వహిస్తూ సీఎం యోగి ఆదిత్యనాథ్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దిగ్విజయ్ సింగ్ డిమాండ్ చేశారు. యూపీలో మహిళలపై అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయన్నారు. బీజేపీ దళిత వ్యతిరేక ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు. 2012 నిర్భయ ఘటనపై దేశంలోని మధ్య తరగతి ప్రజలందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనలు చేపట్టారు. కానీ హత్రాస్ దళిత యువతి మృతి పట్ల ఎవరూ సానుభూతి చూపడం లేదు. ఆమె దళితురాలు కాబట్టి లేదా గ్రామీణ యువతి కాబట్టి అని దిగ్విజయ్ పేర్కొన్నారు. విపక్షాలు కూడా ఈ ఘటనను సీరియస్‌గా తీసుకోవాలని దిగ్విజయ్ సింగ్ అన్నారు.

బతుకమ్మ చీరలతో నేతన్నలకు ఉపాధి

ఆకట్టుకున్న చీరల ప్రదర్శన

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): బతుకమ్మ చీరల తయారీ ద్వారా నేత కార్మికులకు శాశ్వత ఉపాధి లభిస్తున్నది. ఇటీవల హైదరాబాద్ హరితప్లాజాలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. బతుకమ్మ చీరల డిజైన్లు గతం కన్నా బిన్నంగా ఉన్నాయి. అలాగే నాణ్యంగానూ ఉన్నాయని అంటున్నారు. ఈ నెల 9నుంచి పంపిణీకి రంగం సిద్ధం చేశారు. గ్రామాల్లో కోవిడ్ నింబంధనల మేరకు పంచుతారు. ఏటా ఐదు నుంచి ఆరునెలల పాటు ఈ పక్రియ కొనసాగుతున్నది. చీరల తయారీ ద్వారా ఒక్కో కార్మికుడు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు కూలీ పొందుతున్నాడు. అధికారుల గణాంకాల ప్రకారంచూస్తే.. ఏటా చీరలపై వెచ్చించే ఖర్చులో దాదాపు రూ.80కోట్ల వరకు కూలీలకే వెళ్తున్నాయి. అంటే నాలుగేళ్లలో రూ.320 కోట్ల వరకు నేతకార్మికులకు కూలీ రూపంలో అందింది. వీరితోపాటు ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్టు వంటి అంశాల్లో మరో 15 వేల మందికి లబ్దిచేకూరుతున్నది. చీరల తయారీలో నాణ్యత లోపించకుండా చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్ నేతృత్వంలో 50 మంది అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంతో గతంలో ముంబై, భీవండికి ఉపాధి కోసం వెళ్లిన ఎంతోమంది తిరిగి సిరిసిల్లకు తరలివస్తున్నారు.

ఈసారి కొవిడ్ సమయంలోనూ ఇక్కడి నేతన్నలకు ఉపాధి కల్పించడం గమనార్హం. నాలుగేండ్లుగా బతుకమ్మ చీరల తయారీని అప్పగించి నేత కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపుతున్నది. ప్రభుత్వం 2017లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఏటా కోటి చీరలను అందిస్తున్నది. తొలి ఏడాది సమయం సరిపోకపోవడంతో 40 శాతం చీరలను సిరిసిల్లలో తయారుచేయగా మిగ తావి వివిధ ప్రాంతాల నుంచి తెప్పించారు. 2018లో వంద డిజైన్ల తో బంగారు రంగు జరీ అంచు ప్లెయిన్ చీరలను మొత్తం సిరిసిల్లలోనే ఉత్పత్తిచేశారు. 2019లోనూ వంద రకాల డిజైన్లతో బంగారు జరీ అంచు, లైనింగ్‌తో వందశాతం సిరిసిల్లలోనే ఉత్పత్తి చేశారు. ఈసారి గోల్డ్, సిల్వర్ జరీతో 225 రకాల చీరలు ఉత్పత్తి చేసి ఆయా జిల్లాలకు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే 95 శాతం పూర్తయింది. ఇప్పటికే 75 శాతం చీరలను జిల్లాలకు సరఫరా చేశారు. ఈ ఏ డాది రూ.350కోట్లను ప్రభుత్వం ఖర్చుచేస్తున్నది.

హైదరాబాద్ రోడ్ల విస్తరణకు నిధులు కేటాయించండి

500 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు
కేంద్రమంత్రి గడ్కరీకి మంత్రి కెటిఆర్ లేఖ

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని మంత్రి కెటిఆర్ కేంద్రాన్ని కోరారు. ప్రదానంగా విజయవాడ రహదారికి నిధులు కేటాయించాలన్నారు. ఈ మేరకు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కేటీఆర్ గురువారం లేఖ రాశారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 500 కోట్లు కేటాయించాలని కేంద్రమంత్రిని కేటీఆర్ కోరారు. నగర పరిధిలో హైదరాబాద్ - విజయవాడ హైవే సుమారు 25 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. హైదరాబాద్‌లో అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఉన్న ఈ హైవేకు ప్రత్యేకంగా లెవల్ జంక్షన్లు, సర్వీస్ రోడ్లు వంటి సౌకర్యాలతో పాటు లేన్ కెపాసిటీని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ రూ. 500 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న విస్తరణకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పన కోసం ప్రాజెక్టులు చేపట్టిందని కేటీఆర్ తన లేఖలో తెలిపారు. దీంతో నిధులు కేటాయిస్తే ఈ పనులు పూర్తి చేసుకోగలమని అన్నారు.

రాష్ట్రానికి ఐజీఎస్టీ కింద 2,638 కోట్లు చెల్లించాలి : మంత్రి హరీష్

హైదరాబాద్, అక్టోబర్ 1: తెలంగాణకు ఐజీఎస్టీ కింద రావాల్సిన 2638 కోట్లు వెంటనే విడుదల చేయాలి అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు ఐజీఎస్టీ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో డిమాండ్ చేశారు. ఐజీఎస్టీ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో మంత్రి హరీశ్ రావు ఎంసీహెచ్ఆర్డీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సమావేశంలో గ్రూఫ్ ఆఫ్ మినిస్టర్స్ సభ్యులైన ఢిల్లీ, చత్తీస్ ఘడ్, పంజాబ్, తమిళనాడు, ఒడిశా ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఐజీఎస్టీ సెటిల్మెంట్ పై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన ఐజీఎస్టీ మొత్తంపై ఎలాంటి అభ్యంతరాలు లేవు. రాష్ట్రానికి ఎంత ఐజీఎస్టీ రావాల్సి ఉందన్న విషయంపై మాకు స్పష్టత ఉంది. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన 25 వేల 58 కోట్లు ఐజీఎస్టీ మొత్తాన్ని వెంటనే ఇవ్వాలని గ్రూఫ్ ఆఫ్ మినిస్టర్స్ జీఎస్టీ కౌన్సిల్ కు సిఫారసు చేయాలి. తెలంగాణకు ఐజీఎస్టీ కింద రావాల్సిన రూ. 2638 కోట్లు వెంటనే విడుదల చేయాలి అని హరీష్ రావు డిమాండ్ చేశారు. గతంలో ఈ మొత్తాన్ని 25 వేల 58 కోట్లు కన్సాలిడేటెడ్ ఫండ్ లో నిబంధలకు విరుద్ధంగా జమ చేశారన్న విషయాన్ని పార్లమెంట్ లో కాగ్ ఎత్తి చూపిన న విషయాన్ని ఈ సమావేశంలో మంత్రి హరీశ్ రావు ప్రస్తావించారు. కాగ్ సైతం ఈ విషయంలో తప్పు పట్టింది

కాబట్టి ఎలాంటి చర్చ లేకుండా రాష్ట్రాలకు ఈ మొత్తాన్ని ఇవ్వాలన్న సిఫారసును గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఈ నెల ఐదో తేదీన జరిగే జీఎస్టీ కౌన్సిల్ ఎజెండాలో ఉండేలా చూడాలని కోరారు.

అంగీకారం తెలిసిన ఐజీఎస్టీ గ్రూప్ ఆఫ్ మినిస్టర్ కన్వీనర్

అందుకు ఐజీఎస్టీ గ్రూప్ ఆఫ్ మినిస్టర్ కన్వీనర్, బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోడీ అంగీకారం తెలుపుతూ, రాష్ట్రాలకు ఐజీఎస్టీ మొత్తం ఇవ్వాలన్న సిఫారసును ఈ రోజే తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. 2017-2018లో, తిరిగి 2018-2019లో ఇదే తప్పు జరిగిందన్న విషయాన్ని కాగ్ మొన్న పార్లమెంట్ లో బహిర్గతం చేసిందని ఈ సందర్భంగా ప్రస్తావించారు. 208-19లో 13 వేల 944 కోట్లు రాష్ట్రాలకు ఇవ్వాల్సిన మొత్తాన్ని కేంద్రంమళ్లీ కన్సాలిడేటెడ్ ఫండ్ లో జమ చేయడాన్ని కాగ్ మరో మారు తప్పు పట్టిందన్నారు. ఈ మొత్తాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలన్న ఆయన తెలంగాణకు ఇందులో 210 కోట్లు రావాల్సి ఉందని చెప్పారు.

ఐజీఎస్టీలో సెటిల్మెంట్ బేస్ ఆన్ ఆన్వల్ రిటర్న్స్ కింద రాష్ట్రానికి మరో వెయి కోట్లు రావాల్సి ఉందన్న మంత్రి హరీశ్ రావు జీఎస్టీ కౌన్సిల్ ఈ మొత్తాన్ని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో కోరారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, వాణిజ్య, పన్నుల శాఖ కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్, ఆర్థిక, వాణిజ్య, పన్నుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

75వ ఏట అడుగిడిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ, గవర్నర్, సిఎం కెసిఆర్

న్యూఢిల్లీ,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తదితరులు గురువారం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విధాన నిర్ణయాలను అర్థం చేసుకోవడంలో ఆయనకు గొప్ప అంతర్దృష్టి ఉందని, జాతికి రాష్ట్రపతి కోవింద్ గొప్ప ఆస్తి అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధికి అంకితభావంతో ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమని తెలిపారు. పేదల సాధికారతకు అంకితభావంతో పనిచేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. రామ్‌నాథ్ కోవింద్ 1945 అక్టోబర్ 1న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లా పరాంఖ్ ప్రాంతంలో జన్మించారు. 2017 జూలై 25న ఆయన భారత 14వ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి రామ్‌నాద్ కోవింద్ 75వ పడిలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ రాష్ట్రపతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'భారత రాష్ట్రపతి రామ్‌నాద్ కోవింద్ గారికి హార్థిక జన్మదిన శుభాకాంక్షలు. మీరు సంపూర్ణ ఆయురారోగ్యాలతో దేశానికి సేవలు కొనసాగించాలని ఆశిస్తున్నాను. మీ మార్గ నిర్దేశరలో దేశం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను' అని ట్వీట్ చేశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వం, ప్రజల తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలు మీకు ఆ దేవుడు ప్రసాదించాలని కోరుతూ, జాతికి మరింత కాలం సేవ చేయాలని కేసీఆర్ ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు వెలువెత్తుతున్నాయి.

పట్టభద్ర ఓటరుగా నమోదు చేసుకున్న కెటిఆర్

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): మంత్రి కెటిఆర్ పట్టభద్ర ఓటరుగా నమోదు అయ్యారు. గురువారం నుంచి కార్యక్రమం ప్రారంభం కాగా ఆయన తన పేరును నమోగు చేసుకున్నారు.

రంగారెడ్డి - మహబూబ్‌నగర్ - హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంత్రి కేటీఆర్ తన ఓటును నమోదు చేసుకున్నారు.

సంబంధిత పత్రాలను ప్రగతి భవన్‌లో స్థానిక డిప్యూటీ కమిషనర్‌కు కేటీఆర్ అందజేశారు.

ఉన్నత విద్యావంతులైన గ్రాడ్యుయేట్లు తమ పేరును తప్పకుండా గ్రాడ్యుయేట్ ఓటరు లిస్టులో నమోదు చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. నగరంలోని జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన ఓటును నమోదు చేసుకోగా, మంత్రి జగదీశ్ రెడ్డి సూర్యాపేటలో తన ఓటును నమోదు చేసుకున్నారు. మంత్రులు తమ పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు.

మావోల మరో దుశ్చర్య

పోలీస్ ఇన్‌ఫార్మర్ల పేరుతో ఇద్దరు గిరిజనుల హత్య

రాయ్‌పూర్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు వ్యక్తులను మావోయిస్టులు దారుణంగా హతమార్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా జంగల పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గురువారం ఈ ఘటన జరిగింది. మృతులను గనిరాం కొర్స, గోపాల్ కుడియంగా పోలీసులు గుర్తించారు. ఘటనను బీజాపూర్ ఎస్పీ కమలోచన్ కశ్యప్ ధ్రువీకరించారు. గంగలూర్ పరిధిలో కుర్చేలి గ్రామంలో ఇటీవల 16 మందిని మావోయిస్టులు హతమార్చారు.

గత నెల 5న మోటపాల్ - పూనూర్ సమీపంలో నలుగురిని హతమార్చి 25 మందిని అపహరించారు.

ప్రజాకోర్టు నిర్వహించి వీరిలో నలుగురి గొంతు కోసి చంపారు. ఆ తర్వాత ఐదుగురిని విడుదల చేసి మిగతా వారిని సైతం హతమార్చడం రాష్ట్రంలో కలకలం సృష్టించింది. మావోయిస్టులు ప్రజాకోర్టుల పేరిట మారణహోమం సృష్టిస్తుండటంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. మావోయిస్టుల కోసం అటవీ ప్రాంతాన్ని జల్లెడపడుతోంది.

విమాన టిక్కెట్ల మొత్తం వాపస్ చేయాల్సిందే

లాక్‌డౌన్‌కు ముందు బుక్‌చేసిన వారికి వడ్డీతో చెల్లించాలి
తిరిగి ప్రయాణానికి అనుగుణంగా మార్చుకునే వెసలుబాటు
టిక్కెట్ మొత్తాన్ని బదిలీ చేసుకునే వీలు
ఏజెంట్లకు విమానయాన సంస్థలకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): విమాన టికెట్ తీసుకుని లాక్‌డౌన్ సమయంలో ప్రయాణం చేయలేకపోయిన వారికి సుప్రీంకోర్టు ఓ శుభవార్తను వినిపించింది. పౌరవిమానయాన శాఖ ప్రతిపాదించిన రిఫండ్ స్కీమ్‌కు సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. లాక్‌డౌన్ సమయంలో రద్దు అయిన విమానాలకు సంబంధించి ఈ స్కీమ్‌ను రూపొందించారు. జస్టిస్ అశోక్ భూషణ్‌తో కూడిన ధర్మాసనం ఇవాళ ఈ కేసును విచారించింది. ప్రయాణికులకు, విమాన రంగానికి ఆమోదయోగ్యమైన స్కీమ్‌ను ఆహ్వానిస్తున్నట్లు సుప్రీం బెంచ్ పేర్కొన్నది.

ట్రావెల్ ఏజెంట్ల ద్వారా బుక్ అయిన టికెట్లను వారి ద్వారానే రిఫండ్ చేయాలని కోర్టు సూచించింది. టికెట్లు తీసుకున్న ప్రయాణికుల పేరిట క్రెడిట్ షెల్స్ ఓపెన్ చేయాలని విమానాయాన శాఖ సూచన చేసింది. అయితే ప్రయాణికులు క్రెడిట్ షెల్ అకౌంట్‌తో ఏ రూట్లోనైనా తమ ప్రయాణం కోసం తర్వాత టికెట్‌ను బుక్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నారు. ఆ క్రెడిట్ మొత్తాన్ని మరొకరికి కూడా ట్రాన్స్‌ఫర్ చేసే అవకాశం ఇచ్చారు. ఒకవేళ క్రెడిట్ అమౌంట్‌ను ప్యాసింజర్ వాడనిపక్షంలో.. ఆ మొత్తాన్ని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ లోగా ఆ ప్రయాణికుడి ఖాతాలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. కోవిడ్-19 నిరోధానికి అమలు చేసిన లాక్‌డౌన్ ముందు బుక్ చేసిన విమానాల టిక్కెట్ల ధరను ప్రయాణికులకు తిరిగి చెల్లించాలని విమానయాన సంస్థలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మే 24 వరకు ప్రయాణించేందుకు బుక్ చేసుకున్న టిక్కెట్లు విమానయాన సేవలు రద్దయినందు వల్ల ప్రయాణికులకు ఆ సొమ్మును తిరిగి చెల్లించాలని ఆదేశించింది. లాక్‌డౌన్ నేపథ్యంలో విధించిన ఆంక్షల కారణంగా రద్దయిన విమానాల టిక్కెట్ల ధరను తిరిగి చెల్లించడానికి సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రూపొందించిన ప్రణాళికను సుప్రీంకోర్టు గురువారం ఆమోదించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, విమానయాన సంస్థలు తమ వద్ద టిక్కెట్ తీసుకున్న ప్రయాణికుల పేరు మీద క్రెడిట్ షెల్‌ను ఏర్పాటు చేయవచ్చు. ఈ సొమ్ముతో 2021 మార్చి 31లోగా ఏ మార్గంలోనైనా విమానయానం చేసే అవకాశం ప్రయాణికులకు కల్పిస్తారు. ఈ క్రెడిట్ షెల్‌ను వేరొకరికి బదిలీ చేసుకోవచ్చు. టిక్కెట్‌ను రద్దు చేసుకున్న తేదీ నుంచి జూన్ 30 వరకు 0.5 శాతం వడ్డీ, జూలై 1 నుంచి 2021 మార్చి 31 వరకు 0.75 శాతం వడ్డీని విమానయాన సంస్థలు చెల్లిస్తాయి. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకున్నట్లయితే, వారి ద్వారానే ఆ సొమ్మును తిరిగి చెల్లిస్తారని సుప్రీంకోర్టు చెప్పింది. మార్చి 25 నుంచి ఏప్రిల్ 14 మధ్యలో బుక్ చేసిన టిక్కెట్ల ధరను ప్రయాణికులకు తక్షణమే తిరిగి చెల్లించాలని డీజీసీఏ ఏప్రిల్ 16న ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలు కొనసాగుతాయి.

ఈ ఏడాది మార్చి 25 నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కారణంగా అంతకు ముందు బుక్ చేసిన విమాన టిక్కెట్ల సొమ్మును తిరిగి చెల్లించాలని కోరుతూ ప్రవాసీ లీగల్ సెల్, ఎయిర్ పాసింజర్స్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం ఈ తీర్పు చెప్పింది. సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే అడ్వకేట్ జో అబ్రహాంలు కేసును వాదించారు. క్రెడిట్ షెల్ స్కీమ్‌కు అంతర్జాతీయ ప్రయాణికులు కూడా వస్తారని ప్రభుత్వం స్పష్టం చేసింది.

చరిత్రలో నేటినిజం

కం॥ "లీలాలయ"న ధరిత్రిలో
"లీలా సౌరభ"నగ మనచరిత్ర వెలిగి...బి
పాలి"సంఘోద్ఘాటన
లీలగ నూనరించిన సరళిని సుతియింతునే !!

(అక్టోబర్ 2 బోసుకు సహాయకురాలు లీలాబాయ్ ఉరఫ్ లాలానాగ్ జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

పట్టభద్ర ఓటర్ల నమోదుకు సన్నాహాలు

నేటినిజం
శుక్రవారం 2-10-2020

రెండు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాల కోసం టిఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేయడంతో రాష్ట్రంలో ఎన్నికల వేడి అందుకుంది. ఓ వైపు దుబ్బాక ఉప ఎన్నిక..మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికలు..దీనికితోడు హైదరాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికలతో ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయంగా పార్టీలు చురుకుగా ఉన్నాయి. అధికార టిఆర్ఎస్ అంతా అభివృద్ధి చేశామన్న ప్రకటనలతో ప్రజలను వశపర్చుకునే యత్నాల్లో ఉంది. ఊరూరా రెవెన్యూ చట్టానికి మద్దతుగా ట్రాక్టర్ ర్యాలీలతో హడావిడి చేస్తోంది. అయితే కార్యక్రమం ఏదైనా రాజకీయంగా టిఆర్ఎస్‌దే పైచేయిగా కనిపిస్తోంది. ఇకపోతే పట్టభద్ర ఓటర్ల నమోదులోనూ టిఆర్ఎస్ దూకుడుగా సాగుతోంది. ఇదే సందర్భంలో నిరుద్యోగ పట్టభద్రులను ఏ రకంగా సంతృప్తి చేస్తుందన్నది కూడా ముఖ్యమే. అధికార పార్టీపై యువత సహజంగానే కొంత అసంతృప్తితో ఉంది. ఉద్యోగాలు రాక, ఉపాధి దక్కక లక్షలాది మంది నిరుత్సాహంలో ఉన్నారు. వారిని ఎలా మేనేజ్ చేస్తారన్నది ముఖ్యం. గురువారం నుంచి ఓటర్ల నమోదుకు తెరలేవడంతో ఆ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు బిజీ కానున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రధానంగా సన్నాహక సమావేశాలతో ఊరూవాడా చుట్టి వస్తున్నారు. బిజెపి కొన్నిచోట్ల సమావేశాలు చేపట్టింది. కాంగ్రెస్ కూడా అడపదడపా కార్యక్రమాలు చేస్తోంది. ప్రధానంగా పట్టభద్ర ఓట్లు కీలకం కావడంతో..ఓటేసిది వారే కావడంతో ముందుగా వారిని ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియకు తెరలేచింది. దీంతో గ్రామాలవారీగా టిఆర్ఎస్ కార్యాచరణకు పూనుంది. ఓటర్లను గుర్తించి, వారి సర్టిఫికెట్లను జిరాక్స్ తీయించి నమోదు చేయించే బాధ్యతను మండల స్థాయి నాయకులు చూసుకునేలే మంత్రి కెటిఆర్ బాధ్యతలు అప్పగించారు. ఓటర్ల నమోదు కార్యక్రమంతో నల్లగొండ-ఖమ్మం-వరంగల్,హైదరాబాద్,మహబూబ్‌నగర్, రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గంలో ఎన్నికల హడావుడికి తెరలేచింది. ఈ ఎన్నికల్లో కీలకమైన ఓటర్ల నమోదు కార్యక్రమం గురువారం నుంచి లాంఛనంగా ప్రారంభం కావడంతో పట్టభద్రులను వెతికి పట్టుకునే పనిలో పడ్డారు. కార్యకర్తలు ముందుగానే సేకరించిన డేటా మేరకు నమోదు చురుకుగా చేపట్టనున్నారు. పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో గెలుపోటముల్లో ఓటర్ల నమోదు కూడా కీలకంగా పనిచేయనుంది. ఇప్పుడు ఓటర్లుగా నమోదైన వారికి మాత్రమే ఓటుహక్కు ఉండనుంది. దీంతో ఎవరు ఎక్కువ ఓటర్లను చేర్పిస్తే పోలింగ్ నాటికి అది అదనపు ప్రయోజనంగా మారుతుందని ఆయా పార్టీలు, ఆశావహులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల పక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసిన నాటి నుంచే ఎవరి స్థాయిలో వారు రంగంలోకి దిగారు. ఇప్పటికే అందరూ ఓటరు నమోదు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. పట్టభద్రులు ఎక్కడెక్కడ ఉన్నారో వివరాలు సేకరిస్తూ.. నమోదు చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో క్షేత్రస్థాయి వరకు నెట్‌వర్క్‌ను వినియోగించుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ముఖ్యంగా టీఆర్ఎస్ రెండు స్థానాల్లో విజయకేతనం ఎగురవేయాలన్న గట్టి సంకల్పంతో ఉంది. ఈ మేరకు ఇప్పటికే క్షేత్ర స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ క్యాడర్‌కు ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించింది. ప్రజల్లో ఉన్న సానుకూలతను ఆసరాగా చేసుకుని అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని క్యాడర్‌కు దిశానిర్దేశం చేసింది. ప్రభుత్వం ఆయా వర్గాల సంక్షేమం కోసం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పట్టభద్రుల్లోకి తీసుకెళ్లాలని భావిస్తుంది. నియోజకవర్గాల వారీగా జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొని పలు సూచనలు చేశారు. ఓటరు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకునే విధంగా కార్యాచరణ సిద్ధం చేసి రంగంలోకి దిగారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇతరులు కూడా సన్నద్ధమవుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఇంకా ఓటర్ల నమోదుపై కదిలిన దాఖలాలు కనిపించడం లేదు. టీజేఎస్, యువ తెలంగాణ, తెలంగాణ ఇంటి పార్టీలు కూడా రంగంలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. లెఫ్ట్ పార్టీల వ్యూహంపైనా స్పష్టత రావాల్సి ఉంది. వారు పోటీ చేస్తారా లేక ఎవరికైనా మద్దతు ఇస్తారా అన్నది చూడాలి. కోదండరామ్, రాణిరుద్రమ, తీన్మార్ మల్లన్న తదితరులు కూడా రంగంలోకి దిగడంతో పోటీ రసవ్వరం కానుంది. ఈసారి ప్రధాన పక్షాలతోపాటు ఇతరులు కూడా ఎక్కువ మంది నిలువవచ్చని తెలుస్తోంది. ఇదే జరిగితే ఓటర్ల నమోదు కూడా భారీగానే జరుగనుంది. అక్టోబర్1నుంచి వచ్చే నెల ఆరోతేదీ వరకు ఓట్ల నమోదుకు గడువు విధించారు. అనంతరం ముసాయిదా జాబితా ప్రకటించి, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం, ఆపై ఫైనల్‌గా వచ్చే ఏడాది జనవరి 18న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి మార్చి చివరినాటికి మొత్తం ఎన్నికల పక్రియను పూర్తి చేయనున్నారు. 2021 మార్చి 29నాటికి ప్రస్తుత ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రామచంద్ర రావుల పదవీకాలం ముగియనుంది. కాగా ఈ ఎన్నికల్లో ఆశావహులుగా తెరపైకి వస్తున్న వారు ఇప్పటికే ఓటర్ల చేర్పింపుపై దృష్టి సారించారు. దరఖాస్తు ఫారాలతో నేరుగా పట్టభద్రుల వద్దకే వెళ్తున్నారు. గత ఎన్నికల ఓటరు జాబితాలో పేరున్నా.. ప్రతి పట్టభద్రుడు తాజాగా మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవా ల్సిందే. అందుకు సంబంధించిన అధికార ప్రకటనను జిల్లా ఎలక్టోరల్ అధికారి విడుదల చేశారు. ప్రతి మండల, మున్సిపల్ కేంద్రాల్లో ఓటర్ల దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచనున్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన కేంద్రాల్లోనే నిర్ణీత ఫార్మెట్‌లో కొత్త ఓటరు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఫాం 18, 19లను నింపి సంబంధిత అధికారులకు సమర్పించాలి. ఆన్‌లైన్‌లోనూ సంబంధిత ఫారాలను జత చేస్తూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ ఏడాది నవంబర్ ఒకటి నాటికి డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు పూర్తయిన వాళు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా ప్రకటించారు. అంటే 2017 లేదా అంతకు ముందు డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులు. అయితే ఇప్పటికే నిరుద్యో పట్టభద్రుల్లో ఉద్యోగాలు లేక ఆందోళన నెలకొని ఉంది. వారికి ఎలాంటి సందేశం ఇస్తారన్నది అధికార పార్టీలో ఆసక్తిగా ఉంది. ఓటరు నమోదు ద్వారా వారు తమ ఓటును ఎటు వేస్తారన్నది కూడా ముఖ్యమే.

భారీ వర్షాలతో పత్తి రైతుల లబోదిబో

ప్రభుత్వ సాయం కోసం అన్నదాతల చూపు
నష్టంపై నామమాత్రంగా అధికారుల అంచనాలు
సిద్దిపేట జిల్లాలో భారీ వర్షాలతో పత్తి రైతుల లబోదిబో
ప్రభుత్వ సాయం కోసం అన్నదాతల చూపు
నష్టంపై నామమాత్రంగా అధికారుల అంచనాలు

సిద్దిపేట,అక్టోబర్ 1ఆర్ఎన్ఎ): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా సిద్దిపేట జిల్లాలో అనేక ప్రాంతాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పత్తిపంటకు తీరని నష్టం జరగింది. పత్తిరైతులు పంటలపై పెట్టిన పెట్టుబడులు కూడా రాక ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వేలాది మంది రైతుల పంటలు చేతికొచ్చే సమయంలో వర్షానికి నీటమునిగిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 10 వేల మందికి పైగానే రైతులు పంటలను కోల్పోయి ఆదుకోవాలని కోరుతున్నారు. మూడు రోజులుగా పత్తి చేలు నీళ్లలోనే ఉండడంతో మొక్కలన్నీ ఎర్రబారాయి. పూత, కాత దక్కలేదు. పెట్టుబడి డబ్బు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు బోరుమంటున్నారు. సుమారు 4 వేల మందికి చెందిన 8 వేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇక తాజాగా కురిసిన వర్షాలకూ మరో 6,500 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించారు. అయితే ఇది నామమాత్రపు సర్వే అని అవగతమవుతున్నది. ఎందుకంటే భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన మద్దూరు, హుస్నాబాద్, అక్కన్నపేట లాంటి మండలాల ప్రస్తావనను తాజా నివేదికలో పొందుపర్చలేదు. ప్రస్తుతం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 2,41,621 ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నారు. గత ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు పత్తి చేలల్లో నీళ్లు నిలిచాయి. తిరిగి కోలుకునే సమయంలో మళ్లీ వర్షాలు పడడంతో పాత పరిస్థితే దాపురించింది. ఈ వర్షాలకు పూత, కాత కూడా రాలిపోయింది. మరో 20 రోజుల తర్వాత పత్తి ఉత్పత్తి అయ్యే దశకు చేరింది. ఇంతలోనే పెనుముప్పు వాటిల్లింది. మొత్తంగా 30వేల ఎకరాలకుపైగానే వరద నీటితో నష్టపోయినట్లు తెలుస్తున్నది. ఈసారి మొక్కజొన్నకు బదులు చాలామంది రైతులు పత్తిపై ఆసక్తి చూపగా వర్షాలు దెబ్బతీసాయి. వర్షాలకు నష్టపోయిన పంటల గురించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నాలుగైదు సార్లు జిల్లాలో భారీ వర్షాలకు పంటలు నష్టపోయాయి. స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు నష్టంపై తాత్కాలికంగా ఒక అంచనా వేస్తున్నారు. గతంలో ఇలాగే నష్టపోయిన పంటలకు కొంత ఆలస్యంగానైనా పరిహారం అందజేశారు. ఈసారి మాత్రం అలాంటి ఊసే లేదు. కాగా 15 వేల ఎకరాల వరకు అధికారులు అంచనా వేసినప్పటికీ క్షేత్రస్థాయిలో రెట్టింపయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ఈసారి పెట్టుబడి అంతా నీటి పాలైంది. వర్షంతో మాకు గుండెకోత మిగిలిందని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ వర్షాలకు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 12,072 ఎకరాలలో పంటలు నీట మునిగి దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో జరిపిన సర్వేలో వెల్లడైంది. ఈ పంటలన్ని సదాశివపేట, కొండాపూర్, పటాన్‌చెరు, జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో పత్తి, సోయాబీన్ పంటలు దెబ్బతిన్నట్టు సర్వేలో తేలింది. జిల్లాలో సోయాబీన్ పంటకు ఎక్కువ విస్తీర్ణంలో నష్టం వాటిల్లింది. ఒక్క సోయా పంటనే 17.171 ఎకరాల్లో దెబ్బతినగా, పత్తి పంట 2577 ఎకరాల్లో, కందులు 46 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. మొత్తం మీద ఈ రెండు రోజుల్లో జరిగిన పంట నష్టం విలువ సుమారు రూ.29.97 కోట్లు ఉంటుందని రైతు సంఘాలు అంచనా వేశాయి. జిల్లాలోని కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోనే భారీగా పంట నష్టం జరిగింది. ఈ మేరకు వ్యవసాయ అధికారి శశాంక్ ఆధ్వర్యంలో పంటల నష్టాన్ని అంచనా వేశారు. ఈ రెండు మండలాల్లో 7,910 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 101 వ్యవసాయ క్లస్టర్లలో నిర్మాణాలు

-స్వయంగా పర్యవేక్షిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): జిల్లా వ్యాప్తంగా 101 వ్యవసాయ క్లస్టర్లలో రైతువేదికలను నిర్మిస్తున్నారు. ఉట్నూర్ మండలంలో 8, ఇంద్రవెల్లి మండలంలో 6, గాదిగూడలో 4, నార్నూర్‌లో 5, తాంసిలో 4, భీంపూర్‌లో 6, తలమడుగులో 7, గుడిహత్నూర్‌లో 5, ఇచ్చోడ మండలంలో 6, సిరికొండలో 3, బజార్‌హత్నూర్‌లో 6, బోథ్‌లో 7, నేరడిగొండలో 7, జైనథ్‌లో 11, మావలలో ఒకటి, ఆదిలాబాద్ రూరల్ మండలంలో 7, బేలలో 8 చొప్పున రైతు వేదికల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఒక్కో దానిని రూ.22 లక్షలతో నిర్మిస్తుండగా.. భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పది రోజుల కిందట తలమడుగు రైతు వేదిక నిర్మాణం పూర్తయ్యింది. ఉట్నూర్, బోథ్, ఇచ్చోడలో నిర్మిస్తున్న రైతువేదికల పనులు చివరిదశకు చేరుకున్నాయి.ఈ నెల 10 నాటికి జిల్లాలోని 101 వ్యవసాయ క్లస్టర్లలో రైతువేదిక నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఇటీవల జరిగిన సమావేశంలో సూచించారు. బోథ్‌లో నిర్మించిన రైతు వేదిక భవనం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పూర్తి హంగులతో నిర్మాణం పూర్తయింది. ఉట్టి పడుతున్న వ్యవసాయ సాగు చిత్రాలతో ఆకట్టుకుంటున్నది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా వేదిక నిర్మాణం చేపట్టారు. క్లస్టర్ స్థాయిలో వ్యవసాయ సూచనలు, సలహాలు, సాంకేతిక సమాచారం అందించడం కోసం ఈ భవనాన్ని వినియోగించనున్నారు. భవనం లోపలి భాగంలో ఎక్కడా లేని విధంగా మార్బుల్‌తో నిర్మించారు. వ్యవసాయ సాగు విధానంలో రైతుల చిత్రాలతో పాటు రైతు బంధు పథకం, కుటుంబ సమేతంగా పొలం పనులకు వెళ్తున్న చిత్రం, ఆవు, మేక, గొర్రె, కోడిపుంజు, వరి మొక్కను మిళితం వేస్తూ చిత్రాలను వేయించారు. బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, మండల పరిషత్ ఏఈ సర్పింగ్, ఉన్నతాధికారుల సహకారంతో 80 రోజుల వ్యవధిలోనే దీని నిర్మాణం పూర్తి చేయించారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే

ఖమ్మం,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేరుస్తున్నదని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, దీని ద్వారా మండలంలోని ప్రతి ఒక్క కుటుంబానికి ఎంతోకొంత మేలు చేకూరిందని అన్నారు. ప్రభుత్వం నిరుపేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ముందుంటుందన్నారు.ప్రభుత్వం అనేక రకాల ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని, పథకాల ప్రచారంలో టీఆర్ఎస్ సభ్యులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. పట్టభద్రుల ఓటు నమోదు కార్యాక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలను, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాల సమాచారం అందేవిధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రైతు పథకాల అమల్లో తెలంగాణ ఆదర్శం

ఇతర రాష్ట్రాల్లో ఎందుకు లేవని కాంగ్రెస్,బిజెపిలపై విమర్శలు
ప్రచార బాధ్యతను భుజస్కంధాలపై వేసుకున్న మంత్రి హరీష్
ఊరూవాడ ఒంటరిగానే ప్రచారం చేస్తున్న మంత్రి

సిద్దిపేట,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. అధికార టిఆర్ఎస్ బహుముఖ వ్యూహంతో ముందుకు సాగుతోంది. వివిధ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలతో మంత్రి హరీష్ రావు ముందుకు సాగుతున్నారు. అందివచ్చిన రెవెన్యూ చట్టం ఎలా వేలు చేస్తుందో ప్రజలకు వివరిస్తున్నారు. అదే సందర్భంలో కేంద్ర వ్యవసాయ బిల్లులతో పాటు, మోటర్లకు మీటర్ల బిగింపుతో రైతులకు ఉరేసంటూ హెచ్చరిస్తున్నారు. ఈ అంవాలపై బిజెపిని నిలదీయాలని కోరుతున్నారు. అన్ని వర్గాలకు టిఆర్ఎస్ అండగా ఉంటున్నామని తెలుపుతున్నారు. ఇప్పటికే కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ తదితర చెక్కులను పంపిణీ చేశారు. టీఆర్ఎస్ పాలనలో రైతే రాజు.. ఇప్పుడు టీఆర్ఎస్ సర్కారు ఎకరానికి రూ.10వేల చొప్పున రైతుకు సాయం అందిస్తున్నది.. సంక్షేమ పథకాలు అమలులో దేశంలోనే తెలంగాణ

నెంబర్ వన్‌గా నిలిచింది.. కరోనా కష్ట కాలంలోనూ అన్ని సంక్షేమ పథకాలను కొనసాగించిన ఘనత టీఆర్ఎస్ సర్కారుకే దక్కిందని అంటూ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రచారంలో దూసుకుపోతున్నారు.

దుబ్బాకలో దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి అకాల మృతితో ఉప ఎన్నికలు అనివార్యమైనందున, భారీ మెజార్టీతో టీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో కొత్తకొత్త ముఖాలతో ప్రజల వద్దకు వస్తునారని, కనీసం దుబ్బాక నియోజకవర్గంలో.. గ్రామాల పేర్లు.. అవి ఎక్కడున్నాయో తెలియని వారు పోటీ చేసేందుకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. మన ఆపద, సంపదలో రాని నాయకులు, ఎన్నికల సమయమైనందున ఇప్పుడు వస్తున్నారని, వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఉప ఎన్నికల్లో లక్ష మెజార్టీయే లక్ష్యంగా ప్రజలంతా ఆశీర్వదించాలని ఆయన కోరారు. కాంగ్రెస్,బిజెపులు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయలేని సంక్షేమ పథకాలు తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని ప్రజలకు వివరిస్తున్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదని చెబుతున్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వా రా పేదింటి ఆడబిడ్డ పెండ్లికి రూ.లక్షా 116 ప్రభుత్వ స హాయం అందిస్తున్నదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆడబిడ్డ పెండ్లికి ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. కరోనా కష్టకాలంలో మంత్రుల, ఎమ్మెల్యేలజీతాల్లో కొతపెట్టినా పేదలకు మాత్రం అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. మూడేండ్లలో 7లక్షల మంది పేదింటి ఆడబిడ్డల పెండ్లికి రూ.5555 కోట్లు సహాయం అందించిందన్నారు. గతంలో భూమి ఉన్న రైతులు సర్కారుకు రకం కట్టేవారని, ఇప్పుడు టీఆర్ఎస్ సర్కారు ఎకరానికి రూ.10వేల చొప్పున రైతుకే శిస్తు అందిస్తున్నదని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. దేశంలో కేవలం తెలంగాణలోనే రైతుబంధు పథకాన్ని సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. 70ఏండ్లు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు కేవలం మూడేండ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. టీఆర్ఎస్ సర్కారు రైతు సంక్షేమం కోసం కృషి చేస్తుంటే, కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు రైతులను క్షోభకు గురి చేసే విధానాలను అవలంబిస్తున్నదని మండిపడ్డారు. రైతుబోర్లకు మీటర్లు పెట్టేందుకు బీజేపీ సర్కారు సీఎం కేసీఆర్‌కు రూ.2500 కోట్ల ఆఫర్ ఇచ్చిందని, రైతుల కోసం సీఎం కేసీఆర్ ఆ ఆఫర్‌ను తిరస్కరించారని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ తాగు, ప్రతి ఎకరాకు సాగు నీరని, ఇదే తమ టీఆర్ఎస్ నినాదమన్నారు. జిల్లాలో 'కాళేశ్వరం' నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, త్వరలోనే దుబ్బాక నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందుతుందన్నారు. తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, వాటిని వినియోగించుకొని అభివృద్ధి చెందాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. మొత్తంగా బిజెపి అభ్యర్థి రఘునందనరావు కూడా ఊరూరా ప్రచారం పెంచారు. టిఆర్ఎస్ అక్రమాలు, కుటుంబ పాలనపై విమర్శలు సంధిస్తున్నారు. ఈ దశలో హరీష్ రావు ప్రచార బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకున్నారు.

భూ తగాదాలకు చెక్ పెట్టడమే లక్ష్యం

కొత్త రెవన్యూ చట్టంతోనే సాధ్యం
కెసిఆర్ ఆలోచించి చట్టానికి రూపకల్పన: పల్లా

వరంగల్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): రెవెన్యూ చట్టాన్ని మార్చి భవిష్యత్‌లో భూ తగాదాలు రూపుమాపడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్సీ,రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర రెడ్డి అన్నారు. అందుకు అనుగుణంగా సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టాన్ని తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చాక ఊరూరా జరుగుతున్న రైతు జాతరలు చూస్తుంటే వారిలో ఎంతగా ఆనందం ఉందో గమనించ వచ్చన్నారు. భూ తగాదాలు, అవినీతికి తావులేకుండా బిల్లును పకడ్బందీగా తయారు చేసినట్లు తెలిపారు.

అవినీతికి తావివ్వకుండా కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందని పేర్కొన్నారు.

రైతుల భూములకు ఇంచు కూడా తేడా రానివ్వబోమని చెప్పారు. దేశంలో కొవిడ్-19 కష్టకాలంలోనూ అన్ని పథకాలను కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. రాబోయే కాలంలో రైతులు ఇబ్బందులు పడకుండా కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధరకు కొంటున్నారని తెలిపారు. భూ వివాదాలు లేకుండా ఉంటే రైతులకు ఆనందం కలుగుతుందనే ఈ సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకొని అసెంబ్లీలో కొత్త రెవెన్యూ చట్టం తీసుకుని వచ్చినట్లు చెప్పారు. ఈ చట్టం ద్వారా రైతుల భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భద్రత కల్పిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ బిల్లులు రైతులకు అన్యాయం చేసేలా ఉన్నాయని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏళ్ల భూములు సాగు చేసుకుంటున్న గిరిజనేతర రైతులకూ రైతుబంధు పర్తించేలా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. ఇకపోతే సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేకులు టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

6వ తేదీలో స్త్రీనిధి రుణాలు రికవరీ కావాలి

-అధికారులను ఆదేశించిన కలెక్టర్

నారాయణపేట,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీ నిధి బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలను వెంటనే రికవరీ చేయాలని కలెక్టర్ హరిచందన ఆదేశించారు. మండలాల వారీగా రికవరీ చేసిన రుణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో ఇచ్చిన రుణాల రికవరీ పూర్తి చేయాలని, రికవరీ చేయ ని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక పెట్టుబడి నిధి నుంచి ఇచ్చిన రూ.1.0 9లక్షలు, స్త్రీ నిధి రుణాలు 91లక్షలను అక్టోబర్ 6వ తేదీలోగా వసూలు చేయాలన్నారు. తీసుకున్న రుణాలు చెల్లించని మహిళా సంఘాల సభ్యులపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కొవిడ్-19 నిబంధనలు పాటించి బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని సూచించారు. ఈసారి కూడా దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టిందని పేర్కొన్నారు. జిల్లా నుంచి మండలాల వరకు చీరల పంపిణీకి ఏపీఎంలు బాధ్యత వహించాలన్నారు. ఆహార భద్రత, అంత్యోదయ యోజన కార్డులు ఉండి 18 ఏండ్లు పైబడిన మహిళలందరికీ చీరలను పంపిణీ చేయాలని ఆమె సూచించారు. ఇప్పటి వరకు లక్షా 60 వేల చీరలు అందుబాటులో ఉన్నాయని, వీటిని గోడౌన్లలో భద్రపరచారన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు, మహిళా సంఘం సభ్యులు, చౌకధర షాపు డీలర్లు ముగ్గురు కమిటీలుగా ఉంటారని, పట్టణాల్లో బిల్ కలెక్టర్, చౌకధర షాపు డీలర్ కమిటీలుగా ఉంటారని వివరించారు. కమిటీలు లబ్దిదారులను గుర్తించి చీరలు పంపిణీ చేయాలన్నారు. బతుకమ్మచీరల పంపిణీ పక్కాగా సాగాలన్నారు. అక్విటెన్సీ ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల వరకు డీఆర్డీఏకు సమర్పించాలన్నారు. లబ్దిదారుల సంతకం తీసుకున్న తర్వాతనే చీరలను పంపిణీ చేయాలన్నారు. మూడు నెలల నుంచి రేషన్ తీసుకున్న వారిని గుర్తించాలని, లబ్దిదారులకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తప్పని సరిగ్గా ఉండాలన్నారు. దివ్యాంగులు, గర్భిణులు, వృద్ధులు కేంద్రాలకు రాలేని వారిని గుర్తించి ఇంటి వద్దకు వెళ్లి చీరలను పంపిణీ చేయాలన్నారు. చిన్న గ్రామాల్లో ఒక కేంద్రం, పెద్ద గ్రామం అయితే రెండు, మూడు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఉన్నత, ప్రాథమిక ఉన్నత, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో మునగా, నిమ్మ, కరివేపాకు, చెట్ల తోపాటు తదితర మొక్కలను నాటి హరిత హారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు.

వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరిన దృశ్యం

ఎలక్టోరల్ అధికారులుగా డిఆర్వోలు

వరంగల్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్ల జా

రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైన అధికారులు

సంగారెడ్డి, అక్టోబర్ 1 (నేటినిజం ప్రతినిధి)పోషణ అభియాన్ కన్వర్జెన్సీ లో 2018-19 సంవత్సరం జిల్లా నుండి రాష్ట్రస్థాయిలో అవార్డులకు ఎంపికైన సి డి పి ఓ ,మెడికల్ ఆఫీసర్, ఎంపీడీవో, ఏఎన్ఎం, ఆశ ,ఐసిడిఎస్ మహిళా సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్ , అంగన్ వాడి ఆయా కు జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో అవార్డుల ప్రధానం చేశారు.

అవార్డు గ్రహీతలు వీరే:

సదాశివ పేట్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్

సి డి పి ఓ పి.రేణుక, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ. ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో కే .పూజ,

కేటగిరి లలో :

అంగన్వాడి టీచర్ కేటగిరీలలో ఎం. మల్లేశ్వరి, ఏం మీనాక్షి, జి .పార్వతి, కె .మహాదేవి, కే .కల్పన

అంగన్వాడీ హెల్పర్ కేటగిరిలో

జి .మల్లమ్మ,, ఏం రుక్కు మ్ బాయ్, యు .నరసమ్మ, మంగలి వెంకటమ్మ, కే చంద్రకళ

ఏఎన్ఎం కేటగిరీలో:

నిర్మల, డి .సుజాత ,కవిత, డి. లక్ష్మి నాగరాణి.

ఆశా క్యాటగిరి లో:

జయప్రద, యు .అనిత, వి ,భారతి

ఐసిడిఎస్ మహిళా సూపర్వైజర్ కేటగిరీలో:

ఎం. వసుమతి, ఎం జ్యోతి , కే. జమున, బి.సునీత బాయ్, డి. సరళఅవార్డు గ్రహీతలకు అప్రిసియేషన్ సర్టిఫికెట్, మెమెంటో లను అందజేసి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా శ్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ పద్మావతి, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాస్ రావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డాక్టర్ శశాంక్, ఐసిడిఎస్ సి డి పి వో లు, మెడికల్ ఆఫీసర్లు ఎంపీడీవో, సూపర్వైజర్లు, టీచర్ లు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ గారు అవార్డ్స్ ప్రధానం చేస్తారు. ఫొటోస్ పంపుతాం. ముందు వివరాలు పంపించాము. గమనించగలరు.

బాబ్రీ తీర్పును స్వాగతిస్తున్నాం

ఆర్ఎస్ఎస్ సహకార్యవాహ్ భయ్యాజీ ట్వీట్

నాగపూర్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): బాబ్రీ మసీదు కూల్చివేతపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్వాగతించింది. ఈ మేరకు సర్కార్యవాహ భయ్యాజీ జోషి ట్వీట్ చేశారు. సవాళ్లను ఎదుర్కోడానికి దేశంలోని అన్ని వర్గాలు సామరస్యం కదలాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బాబ్రీ మసీదు కూల్చివేతపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఆరెస్సెస్ స్వాగతిస్తోంది. దేశముందున్న సవాళ్లను ఎదుర్కోడానికి అన్ని వర్గాలు కలిసి కట్టుగా, సామరస్యంగా ముందకు రావాలి. సవాళ్లను ఎదుర్కొనేందుకు విజయవంతంగా పనిచేయాలి. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని భయ్యాజీ జోషి ట్వీట్ చేశారు. బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో సంచలన తీర్పు వెలువడింది. మసీదు కూల్చివేత కుట్రకాదని ... కూల్చివేతకు సరైన సాక్ష్యాధారాలు లేవని జడ్జి ఎస్కే యాదవ్ పేర్కొన్నారు. 2000 పేజీల తీర్పును న్యాయమూర్తి ఎస్కే యాదవ్ చదివి వినిపించారు. దీంతో ప్రధాన నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న ఎల్కే అద్వాణీ, మురళీ మనోహర్ జోషి, ఉమా భారతీ సహా 32 మంది నిందితులు నిర్దోషులుగా తేలారు. 28 సంవత్సరాల అనంతరం ఈ కేసులో తుది తీర్పు ఇవాళ వెలువడింది. అభియోగాలు ఎదుర్కొంటున్న వారిలో 26 మంది కోర్టుకు హాజరు కాగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరుగురు నిందితులు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి బిజెపితో పాటు ఆర్ఎస్ఎస్ కూడా తీర్పును స్వాగతించాయి.

నవంబర్ 11 తరవాత ఎన్నికలని అనలేదు

జిహెచ్ఎంసి యాక్ట్ ప్రకారం రెండోవారంలో అన్నా: కెటిఆర్

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): నవంబర్ 11వ తేదీ తర్వాత గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు ఉంటాయని తాను వ్యాఖ్యానించినట్లు కొన్ని మీడియా సంస్థలు రిపోర్టు చేయడంలో నిజం లేదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం నవంబర్ రెండో వారం తర్వాత ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చని, అందుకు పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని మాత్రమే తాను అన్నానని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్, నిర్వహణ పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని ఆయన తెలిపారు. సదరు మీడియా సంస్థలు తాను అనని మాటలను తనకు ఆపాదించడం జరిగింది.. అది సరికాదని కేటీఆర్ అన్నారు. నిబంధనల ప్రకారం నవంబర్ రెండో వారం తర్వాత ఎప్పుడైనా జీహెచ్ఎంసీ ఎన్నికలు రావొచ్చన్నారు. పోరుకు ఇప్పటి నుంచే సన్నద్ధమవ్వాలని సూచించారు. సర్వేలన్నీ తెలంగాణ రాష్ట్ర సమితికే అనుకూలంగా ఉన్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ 91 సీట్లు కచ్చితంగా వస్తాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 15 శాతం మంది కార్పొరేటర్ల పనితీరు మారాలి. జనంతో మమేకమై వారితో కలిసి పనిచేస్తేనే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని సూచించారు.

శాసనసభ్యులకు అభినందన

హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్ కుమార్, దేవరకద్ర శాసనసభ్యులు అల వెంకటేశ్వర్ రెడ్డిల పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని మంత్రి కేటీఆర్ ఇరువురి ఎమ్మెల్యేలకు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ... ఇరువురు ఎమ్మెల్యేలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. జన్మదినం సందర్భంగా మొక్కలు నాటాల్సిందిగా కోరారు

పట్టభద్ర రైతులంతా ఓటు నమోదు చేయించుకోవాలి

ములుగులో ఎమ్మెల్సీ పట్టబద్ర ఓటర్ల నమోదుకు సంబంధించి జరిగిన సన్నామక సమావేశంలో మాట్లాడిన మంత్రి సత్యవతి రాథోడ్

ములుగు,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో ఉన్న ఎక్కువ మంది పట్టభద్రులు రైతు బిడ్డలేనని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడో అన్నారు. రైతులకు సీఎం కేసీఆర్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఏ రాష్ట్రంలో చేయడం లేదు. అందుకే గ్రామాల్లో ప్రతి పట్టభద్రున్ని ఓటరుగా తప్పకుండా నమోదు చేయాలని సత్యవతి రాథోడో అన్నారు. ములుగు జిల్లా ఓటరు నమోదు సన్నాహక కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఓటరు నమోదు కార్యక్రమంలో ఇబ్బందులను మా దృష్టికి తీసుకురండి. పాత ఓటర్ల జాబితా అనుసరించి, వారితో పాటు కొత్త వారిని కూడా నమోదు చేయాలన్నారు. ఈ ఎన్నికలకు పాత ఓటర్ల సభ్యత్వం ఆటోమెటిక్ గా నమోదు జరగదు.

అందరూ మళ్లీ తమ పేరును నమోదు చేసుకోవాల్సిందేనని మంత్రి తెలిపారు. ఊర్లలో ఉన్న పార్టీ పెద్దల సహకారంతో ఈ ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. ఏ ఒక్కపట్టభద్రుడు మిగిలిపోకుండా నమోదు చేయాలన్నారు. సీఎం ఏజెన్సీలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. తప్పకుండా ఈ ప్రాంతంలో వస్తుందని పేర్కొన్నారు. ములుగు జిల్లా అంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానం. ములుగు జిల్లాలో అన్ని రంగాలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా నుంచి పార్టీ సూచించిన అభ్యర్థికి భారీ మెజారిటీ కట్టబెట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

-సన్నాహక సమావేశంలో మంత్రి సత్యవతి రాథోడ్

రైతు వేదికలకు త్వరితగతిన విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి

- విద్యుత్ శాఖ అధికారులను కోరిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 1 (నేటినిజం ప్రతినిధి) బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యుత్ , వ్యవసాయ, పంచాయితీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతు వేదికలు కొన్ని పూర్తికాగా, మిగిలినవి ఫినిషింగ్ దశలో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 34 రైతు వేదికలకు విద్యుత్ కనెక్షన్లు, సరఫరా పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికతో మెటీరియల్ తో తమ సిబ్బందిని పంపి త్వరితగతిన విద్యుత్ కనెక్షను, సరఫరాకు సంబంధించిన పనులు పూర్తి చేయాలని ట్రాన్స్ కో ఎస్సీ కి సూచించారు. ప్రాధాన్యతా పరంగా పనులు పూర్తిచేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా రైతు వే దికలు ప్రారంభించు కునేలా విద్యుత్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. చెల్లించాల్సిన డబ్బులు వెంట వెంటనే చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఇటీవల రామేశ్వర బండలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అలాట్మెంట్ చేశామని, ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కావాలని వారి నుండి అభ్యర్థన వచ్చిన వెంటనే కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

గ్రామ పంచాయతీల లో విద్యుత్ బకాయిలకు సంబంధించి విద్యుత్ శాఖ ఎస్సీ, జిల్లా పంచాయతీ అధికారి రీ కన్సిలేషన్ చేసుకోవాలని సూచించారు. అవసరం లేని విద్యుత్ కనెక్షన్లను తొలగించడానికి విద్యుత్ శాఖకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా పంచాయతీ అధికారి కి సూచించారు.

ఈ సమావేశంలో ట్రాన్స్కో ఎస్సీ రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి యు. శ్రీనివాస రావు , వ్యవసాయ శాఖ జె.డి నరసింహారావు, విద్యుత్ శా ఖ డీఈలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, వ్యవసాయ శాఖఏ డి ఏ లు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణజన్మభూమి పిటిషన్ కొట్టేసిన కోర్టు

-హైకోర్టును ఆశ్రయిస్తామన్న పిటిషనర్లు

లక్నో,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): కృష్ణ జన్మభూమి పిటిషన్‌ను మధుర సివిల్ కోర్టు తిరస్కరించింది. దీనిపై అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు పిటిషన్‌దారులు నిర్ణయించారు. శ్రీకృష్ణ జన్మభూమి పక్కనే ఉన్న షాహి ఈద్గా మసీదును తొలగించి మొత్తం భూమిని అప్పగించాలంటూ 'భగవాన్ శ్రీ కృష్ణ విరాజ్మన్' తరపున న్యాయవాదులు హరిశంకర్, విష్ణు జైన్ మధుర కోర్టులో సెప్టెంబర్ 25 న దావా వేశారు. వీరి పిటిషన్ ప్రకారం, రాయల్ ఇద్గా మసీదు ఉన్న ప్రదేశం శ్రీకృష్ణుడు జన్మించిన జైలు. ఈ భూమి ప్రతి అంగుళం.. శ్రీ కృష్ణుడి భక్తులకు, హిందూ సమాజానికి ఎంతో పవిత్రమైనదని 'భగవాన్ శ్రీ కృష్ణ విరాజ్మన్' పేర్కొంటున్నది. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సేనలు శ్రీకృష్ణుడి జన్మస్థలం అని నమ్ముతున్న స్థలంలోని కొంత భాగాన్ని ధ్వంసం చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆలయం పక్కన ఉన్న ఒక మసీదును తొలగించి తమకు అప్పగించాలని పిటిషన్‌దారులు కోరారు. ఏ మత ప్రదేశంలోనైనా 1947 నాటి యథాతథ స్థితిని మార్చే వ్యాజ్యాన్ని నిషేధించే చట్టాన్ని ఉటంకిస్తూ కోర్టు ఈ దావాను విచారించేందుకు నిరాకరించింది. ఆరాధన స్థలాలు (ప్రత్యేక నిబంధనలు) చట్టం, 1991, అయోధ్య యాజమాన్య వివాదానికి మినహాయింపు ఇచ్చింది. అయోధ్యలో రామ్ జన్మభూమి వివాదం పరిష్కారం కావడంతో హిందూత్వ సంస్థలు కృష్ణ జన్మభూమిపై దృష్టి సారించాయి. 'ఈ భూమి ప్రతి అంగుళం శ్రీ కృష్ణుడు, హిందూ సమాజ భక్తులకు పవిత్రమైనది' అని న్యాయవాది విష్ణు జైన్ తన దావాలో 13.37 ఎకరాల 'శ్రీ కృష్ణ జన్మభూమి' ప్రక్కనే ఉన్న షాహి ఈద్గా మసీదును తొలగించాలని డిమాండ్ చేస్తూ మొత్తం భూమిని శ్రీకృష్ణ మందిరానికి అప్పగించాలని దావాలో కోరారు. వచ్చే నెల 15న బృందావన్‌లో నిర్వహించే అఖారా పరిషత్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని అధ్యక్షుడు మహంత్ నరేంద్ర గిరి చెప్పారు. అయోధ్యలో రామ్ జన్మభూమి తర్వాత మథుర, కాశీలను కూడా విడిపించాల్సిన అవసరం ఉన్నదని బీజేపీ నాయకుడు వినయ్ కటియార్ అన్నారు. 'అవసరమైతే ఈద్గా ఆక్రమణను తొలగించి, కృష్ణ జన్మభూమిని తిరిగి పొందటానికి ఒక ఉద్యమం ప్రారంభించాలి' అని ఆయన చెప్పారు. ఇలాఉండగా, భగవాన్ శ్రీకృష్ణ విరాజ్మాన్ దాఖలు చేసిన సివిల్ దావా అసంబద్ధమైనదని హాజీ మెహబూబ్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ పిటిషన్‌తో తమకు, ట్రస్ట్‌కు ఎటువంటి సంబంధం లేదని శ్రీ కృష్ణ జన్మస్థాన్ సేవా సంస్థ ట్రస్ట్ (శ్రీ కృష్ణ జన్మభూమి న్యాస్) కార్యదర్శి కపిల్ శర్మ అన్నారు.

సిఎం కెసిఆర్ సెక్రటరీగా శేషాద్రి

-రెవెన్యూ చట్టంలో సుదీర్ఘ అనుభవం ఉన్న అధికారి

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): తెలంగాణ సీఎం కేసీఆర్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ వి. శేషాద్రి నియమితులయ్యారు. వి.శేషాద్రి 1999 బ్యాచ్‌కు చెందిన అధికారి. ఐదున్నరేళ్లుగా కేంద్ర సర్వీసులో, అందులోనూ ప్రధానమంత్రి కార్యాలయ బాధ్యతల్లో ఉన్న ఆయన తాజాగా అక్కడ సర్వీసులు పూర్తిచేసుకొని.. కొన్ని రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్ట్ చేశారు. ఆయన వచ్చీరాగానే ప్రభుత్వం రెవెన్యూ,భూ చట్టాల సమీక్ష బాధ్యతలను కట్టబెట్టింది. 1999 బ్యాచ్‌కు చెందిన శేషాద్రి రెవెన్యూ శాఖలో కీలక ముద్ర వేశారు. అత్యంత విలువైన భూములు కలిగిన రంగారెడ్డి జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా పనిచేశారు. యూఎల్సీ ప్రత్యేకాధికారిగా కూడా ఉన్నారు. రికార్డ్ ఆఫ్ రైట్(ఆర్‌వోఆర్) చట్టాన్ని అనుసరించి, ఆయన ఇచ్చిన ఉత్తర్వులు చిరస్థాయిగా ఉంటాయని రెవెన్యూ అధికారులు చెబుతుంటారు. బెంగళూరు లోని నేషనల్ స్కూల్ ఆఫ్ లా నుంచి పట్టభద్రుడైన శేషాద్రికి రెవెన్యూ చట్టాలపై గట్టి పట్టుంది. మితభాషిగా పేరున్న ఆయనకు సమర్థుడైన అధికారిగా పేరుంది.

సింగూరుకు జలకళతో పర్యాటక సందడి

పదిరోజులుగా పెరుగుతున్న తాకిడి

తాగు,సాగునీటి సమస్య తీరిందంటున్న ప్రజలు

సంగారెడ్డి,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): మూడేండ్ల తర్వాత సింగూరు ప్రాజెక్టుకు జలకళ సంతరించుకోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది. రెండేళ్ల తర్వాత ప్రాజెక్టులోకి వరదలు రావడంతో పర్యాటకులు సందడి చేస్తున్నారు. పది రోజులుగా సందర్శకులతో సింగూరు ప్రాజెక్టు కిటకిటలాడుతున్నది. ప్రాజెక్టును చూడడానికి రోజువారీగా వందలాది మంది తరలివస్తున్నారు. ప్రాజెక్టు పరిసరాల్లో వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. మూడేండ్ల నుంచి నీళ్లు లేక ఇటువైపు ఎవరూ రాలేదని, ఇప్పుడు మళ్లీ ఈ ప్రాంతంలో పండుగ వాతావరణం కనిపిస్తున్నదని చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వానకాలం ఆరంభం నుంచి ఆశించిన వరద రాక సింగూరు ప్రాజెక్టు వెలవెలబోయింది. దాదాపు మూడు నెలల పాటు ఇదే పరిస్థితి కొనసాగింది. తీరా గత నెలలో ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురిసినీటిరాక కొనసాగడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలోకి చేరింది. సాగు, తాగునీటికి ఢోకా ఉండదని అధికారులు భావిస్తున్నారు. సింగూరు ప్రాజెక్టులోకి నీళ్ల రావడంతో సంగారెడ్డి జిల్లాలోని పుల్కల్, అందోలు, సదాశివపేట, మునిపల్లి మండలాల్లో మొత్తం 40 వేల ఎకరాలకు ఇక సాగునీళ్లు అందనున్నాయి. ప్రాజెక్టులోకి వచ్చిన నీళ్లను చూసి స్థానిక రైతులు మురిసిపోతున్నారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ రైతులతో కలిసి గంగమ్మకు పూజలు చేశారు. ఈ ప్రాజెక్టు నుంచి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్, మెదక్ జిల్లాలోని ఘనపురం ఆయకట్టుకు నీటి కేటాయింపులు ఉన్నాయి. ఈసారి స్థానిక అవసరాలకే వాడుకుంటామని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. గతంలో హైదరాబాద్‌కు తాగునీటిని కూడా సింగూరు నుంచి తరలించేవారు. అక్కడకి కృష్ణా జలాలు వస్తుండడంతో తరలించే అవకాశం లేకుండా పోయింది. మిషన్ భగీరథ ద్వారా సింగూరు నుంచి సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోలు, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరుతో పాటు మెదక్, నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఏటా మిషన్ భగీరథకు 3 టీఎంసీల నీటిని వినియోగించనున్నారు. సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వ పెరగడంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగాయని రైతులు తెలిపారు. కాలువలు మరమ్మతు చేయడంతో 2016లో ప్రాజెక్టులోకి నీళ్లు రాగా, 40వేల ఎకరాలకు సాగునీరందించారు.

బాబ్రీ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

-కాంగ్రెస్ అధికార ప్రతినిధి సూర్జేవాలా

న్యూఢిల్లీ,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో సీబీఐ స్పెషల్ కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. బాబ్రీ మసీదు కూల్చివేత పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని, న్యాయవ్యవస్థ అసాధారణ రీతిలో ఉల్లంఘనకు గురైందని 2019, నవంబర్ 9న సుప్రీంకోర్టులోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు, ప్రస్తుతం సీబీఐ స్పెషల్ కోర్టు ఇచ్చిన తీర్పు పరస్పర విరుద్ధంగా ఉన్నదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా పార్టీ తరఫున ఒక ప్రకటన విడుదల చేశారు. బాబ్రీ మసీదు కూల్చివేత కోసం ఆ రోజుల్లో బీజేపీ-ఆర్ఎస్ఎస్ పన్నిన భారీ కుట్రకు దేశమంతా సాక్ష్యంగా నిలిచిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. నాటి కుట్రలో అప్పటి యూపీ ప్రభుత్వం కూడా సహ కుట్రదారుగా ఉన్నదని ఆరోపించారు. దేశంలోని మతసామరస్యానికి, సోదర స్వభావానికి నాటి ఘటన విఘాతం కలిగించిందని విమర్శించారు. ఇదిలావుంటే, భారత రాజ్యాంగంపైనా, దేశంలో మత సామరస్య స్ఫూర్తిపైనా, సోదరభావంపైనా విశ్వాసం ఉన్న ప్రతి పౌరుడు సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పుపై స్పందించాలని, ఆ తీర్పుపై పైకోర్టుల్లో అప్పీల్ చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది.

వృద్ధులు మన జాతి సంపద : మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, అక్టోబర్ 1: వృద్ధులు మన జాతి సంపద. మన వారసత్వానికి ప్రతినిధులు. వారిని గౌరవించడం మన బాధ్యత అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో గల గాయత్రి విశ్వ కర్మ వృద్ధుల ఆశ్రమంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ సదందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రతి జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్ ఆత్మగౌరవం కోసమే ఆసరా పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు.

వృద్ధుల సంక్షేమం, ఆహారం, ఆరోగ్యం తదితర విషయాల పరిశీలన, ఆశ్రమ నిర్వహణ సమస్యల పరిష్కారం, నిపుణుల సూచనలు, సలహాలు తదితర అంశాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకమైన ఆప్ ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, స్థానిక శాసన సభ్యుడు సంజయ్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ బోగ శ్రావణి, కలెక్టర్ రవి, ఆర్డీవో మాధురి, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ అధికారి నరేష్ పాల్గొన్నారు.

నెలాఖరు వరకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్

-90శాత్ వడ్డీ రాయితీపై విస్తృత ప్రచారం

వరంగల్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): ఏళ్ల తరబడి ఆస్తి పన్ను బకాయిలపై ఉన్న వడ్డీపై రాష్ట్ర సర్కారు బంపరాఫర్ ఇచ్చింది. వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీంలో భాగంగా 2019-20 వరకు బకాయి ఉన్న ఆస్తి పన్నుతో పాటు 10 శాతం వడ్డీ చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ చేసే సువర్ణావకాశం కల్పించింది. వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీంకు అక్టోబర్ 31 దాకా అవకాశం కల్పించింది. ఇదే చివరి అవకాశంగా ప్రభుత్వం తెలిపింది. ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లించకుండా ఉన్న మొండిబకాయిదారులకు పన్నుతో పాటు వడ్డీ సమానంగా ఉంది. ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు మూడు నెలల క్రితం మొండిబకాయిదారుల పేర్లను బహిరంగంగా ప్రదర్శించారు. పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను, వడ్డీ బకాయి ఉన్న వారి కోసం ప్రభుత్వం ఈ స్కీంను ప్రకటించింది. ప్రభుత్వం ప్రకటించిన వన్ టైం సెటిల్‌మెంట్ స్కీంపై గ్రేటర్ కార్పొరేషన్ విస్తృత ప్రచారం చేస్తున్నది. నగరంలోని హోర్డింగ్‌లు, డివైడర్ల మధ్య ఉన్న లాలిపప్స్ ద్వారా ప్రచారం కల్పిస్తున్నది. పోస్టర్లు, ఇంటింటికీ స్టిక్కర్లను అంటించి వన్ టైం సెటిల్‌మెంట్ స్కీంపై ప్రజలకు గ్రేటర్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అక్టోబర్ 31 నాటికి ఈ స్కీం గడువు ముగియనుందని, ఈ ఆఫర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. పన్నుల విభాగం సిబ్బందితో కమిషనర్ పమేలా సత్పతి వరుస సమావేశాలు నిర్వహిస్తూ వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీంను ప్రజల్లోకి తీసుకెళ్లి వసూళ్లు పెంచాలని సూచిస్తున్నారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారి వద్దకు పన్నుల విభాగం అధికారులు నేరుగా వెళ్లి మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కమిషనర్ సూచించారు. కార్పొరేషన్ పరిధిలో సుమారు రూ. 20కోట్ల దాకా బకాయిలున్నాయి. ఆస్తి పన్ను కంటే వడ్డీ పెద్ద మొత్తంలో పేరుకపోయిన వారికి ప్రభుత్వం ఉపశమనం కలిగించింది. ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారికి వన్ టైం సెటిల్ మెంట్ మంచి అవకాశమని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ స్కీంను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రేటర్ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆఫర్‌తో మొండిబకాయిదారులు సానుకూలంగా స్పందిస్తున్నారని బల్దియా అధికారులు అంటున్నారు. ఇప్పటివరకు రూ.8కోట్ల దాకా వసూలైనట్లు చెబుతున్నారు. పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను, వడ్డీ కట్టాల్సిన వారి వద్దకు ప్రత్యేక బృందాలుగా వెళ్లి బల్దియా అధికారులు వసూలు చేస్తున్నారు.

కెసిఆర్ గొప్ప సంస్కరణ వాది

-ప్రజలకు ఏది అసవరమో అదే ఆలోచిస్తారు: ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,అక్టోబర్ 1:(ఆర్ ఎన్ఎ): సీఎం కేసీఆర్ గొప్ప సంస్కరణ వాదని,ప్రజలకు ఏది అవసరమో అదే చేసి చూపిస్తున్నారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. నూతన రెవెన్యూ చట్టానికి మద్దతుగా రైతులు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మంత్రి పాల్గొని ట్రాక్టర్ నడిపారు. ఐనవోలు క్రాస్ రోడ్ నుంచి వర్ధన్నపేట వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రెవెన్యూ చట్టం రైతుల పాలిట వరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బిల్లు పూర్తిగా రైతు వ్యతిరేకమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోయినా.. కనీసం అవార్డులు ఇచ్చి ప్రశంసించడం సంతోషకరమన్నారు. అలాగే వ్యవసాయేతర భూములను క్రమబద్ధీకరణ చేయడం ద్వారా ప్రజల ఆస్తులు, భూములకు పూర్తి భద్రత కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే ఆరూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కరోనా పేషెంట్లకు పరామర్శ

కరోనా బాధితుల ఇంటికెళ్లి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. గతంలో మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్ తో కలిసి పీపీఈ కిట్లతో వరంగల్ ఎంజిఎం హాస్పిటల

వ్యవసాయంపై ప్రభుత్వం రూ. 60 వేల కోట్లు ఖర్చు

సానుకూల విధానాలతో రైతులకు ఎంతో మేలు
రెవన్యూ చట్టంతో గ్రామాల్లో ఆనందం
ర్యాలీలో పాల్గొన్న మంత్రులు

నారాయణపేట, అక్టోబర్1(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సానుకూల విధానాలు అనేకం తీసుకువస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయంపై ప్రభుత్వం రూ. 60 వేల కోట్లు ఖర్చుపెడుతుందని తెలిపారు. రెవెన్యూ చట్టంతో ఏ గ్రామంలో చూసినా రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. నూతన రెవెన్యూ చట్టానికి మద్దతుగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు భారీ ట్రాక్టర్ల ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జెడ్పి చైర్‌పర్సన్ వనజమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఏ గ్రామంలో చూసిన రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కరోనా వంటి కష్ట సమయంలో గ్రామాల్లో వ్యవసాయం పండగలాగా జరుగుతుందన్నారు. గ్రామాల్లో భూ సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు.

వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని సుదీర్ఘ కసరత్తు అనం తరం సీఎం కేసీఆర్ భూ సమస్యల పరిష్కా రం కోసం కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసు కొచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వెల్లడించారు. మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు సాను కూల విధానాలు అనేకం ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. సాగునీరు, 24 గంటల విద్యుత్ రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు.

రైతు భూ సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టం తీసుకొచ్చినట్లు చెప్పారు. భారతదేశంలో ఉన్న చట్టాలను అధ్యయనం చేసి మూడేండ్ల కసరత్తు అనం తరం ఈ చట్టం రూప కల్పన జరిగినట్లు వెల్లడించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూమిని ధరణి వెబ్‌సైట్‌లో పొందుపరు స్తారు. చిన్న, సన్నకారు రైతుల భూమికి భద్రత లభిస్తుంది. రైతు గౌరవాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 60 వేల కోట్ల రూపాయలు వ్యవసాయం కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతున్నట్లు తెలిపిన మంత్రి అదే బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇరవై వేల కోట్ల రూపాయలు కూడా ఖర్చు పెట్టడం లేదన్నారు. కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ బిల్లు రైతు వ్యతిరేకం అన్నారు. టీఆర్ఎస్ తోపాటు పలు పార్టీలు పార్లమెంట్ లో తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. దేశ రాజధానిలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు.

కొత్త చట్టంతో రైతుల మీద పడి దోచుకునే వాళ్లకు లైసెన్స్ వస్తుందని, కార్పొరేట్ ల నియంత్రణలో మార్కెట్ ఉంటుందన్నారు. ఈ చట్టం రైతు, ప్రజల, వ్యవసాయ వ్యతిరేకం అన్నారు. మరోవైపు కేంద్ర విద్యుత్ బిల్లుతో మోటార్‌లకు మీటర్లు బిగించాల్సి వస్తుందన్నారు.

పట్టభద్ర ఓటును నమోదు చేసుకున్న మంత్రి

ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలన్న జగదీశ్వర్ రెడ్డి

సూర్యాపేట,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు విధిగా ఓటు నమోదు చేసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. 2017 అక్టోబర్ 17 నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లుగా అర్హులే నని ఆయన చెప్పారు. గురువారం ఉదయం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో మంత్రి తన సతీమణి సునీతా జగదీష్ రెడ్డితో సహా ఓటును నమోదు చేసుకున్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ఈ రోజు ఉదయం నుంచి ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఓటర్ల నమోదు పక్రియను గులాబీ శ్రేణులు ప్రారంభించారు. అందులో బాగంగా సూర్యాపేటలో తన ఓటును పార్టీ శ్రేణులతో కలసి వచ్చిన మంత్రి జగదీష్ రెడ్డి నమోదు చేసుకోవడం తో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్టీ శ్రేణులను మానిటరింగ్ చేస్తూ ఓటర్ల నమోదు పక్రియను వేగవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఇంటర్ తరువాత మూడు సంవత్సరాలు డిగ్రితో సమానమైన విద్యను అభ్యసించిన వారందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

సూర్యాపేటలో పట్టభద్ర ఓటరుగా నమోదు చేయించుకున్న మంత్రి జగదీశ్వర్ రెడ

గ్రామాల్లో ఇళ్లకూ పాస్ పుస్తకాలు

-ప్రజలకు భద్రత కలుగుతుందన్న అధికారులు

సిద్దిపేట, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): కొత్త రెవెన్యూ చట్టంలో భాగంగా, వ్యవసాయ భూముల మాదిరిగానే.. గ్రామాల్లోని ఇండ్లు, ఇతర అన్ని రకాల నిర్మాణాలకు కూడా భ్రదత కల్పిస్తూ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం అన్ని ఇండ్లను, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల వివరాలను ధరణి పోర్టల్ లో పొందుపరచాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు.సంబంధిత గ్రామాలు పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఈ సర్వే నిర్వహించాలన్నారు. బుధవారం జిల్లాలో పర్యటించిన ఆయన జిల్లా కలెక్టర్ వెంకట్రామ్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ధరణి పోర్టల్ లో అప్ లోడ్ చేయాల్సిన వివరాలు, తదితర అంశాలపై అన్ని మండలాల ఎంపీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ప్రతి గ్రామంలో ఉన్న ఇండ్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల వివరాలను ధరణి పోర్టల్ లో పొందుపరచాలని సూచించారు. ధరణి ఆప్‌లో ఆస్తుల వివరాలను నమోదు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. గ్రామంలో ఉన్నటువంటి పాఠశాలలు, దేవాలయాలు ఇతర భూముల వివరాలను తప్పనిసరిగా పొందుపంచాలన్నారు. ఆస్తులకు సంబంధించిన యజమాని వివరాలు, ఫొటో ను అప్ లోడ్ చేయాలన్నారు. అనంతరం సిద్దిపేట గ్రామీణ మండలంలోని దోర్నాల గ్రామంలో పర్యటించిన ఆయన ప్రత్యక్షంగా ఓ ఇంటికి వెళ్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంటి యజమాని నుంచి సేకరిస్తున్న పక్రియను పరిశీలించారు.ప్రజలు ఎలా స్పందిస్తున్నారు అని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ప్లలె ప్రకృతి వనాన్ని సందీప్ కుమార్ సుల్తానియా పరిశీలించి మొక్కల పెంపకం, మొక్కలు నాటు విధానం, వనంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ అధికారి గోపాల్ రావు, డీపీవో సురేష్ బాబు, సీఈవో శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధించాలి

కేంద్రం ఇవ్వాల్సిన వెయ్యి కోట్ల నిధులను విడుదల చేయాలి
రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ భేటీలో మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇప్పటి వరకు కేంద్రం నుంచి రావాల్సిన వెయ్యి కోట్ల నిధులను వెంటనే ఇవ్వాలని, అలాగే, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర ఉపాధిహామీ కౌన్సిల్ 5వ సమావేశం హైదరాబాద్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కౌన్సిల్ సభ్యులు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, గిరిజన సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, దేశంలో, ఉపాధి హామీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పని దినాలను, నిరుపేదలకు ఉపాధిని కల్పించలిగామన్నారు. ప్రత్యేకించి కరోనా వైరస్ విస్తరణ, లాక్ డౌన్ సమయంలో కేవలం 15 రోజుల్లోనే 25లక్షల మందికి ఉపాధి కల్పించాం. ఇది జాతీయ రికార్డు అన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా ఉపాధి కల్పనతోపాటు, నిరుపేదల ఆర్థిక స్థాయిని కూడా పెంచగలిగామని తెలిపారు. తెలంగాణలో 29.23 కుటుంబాలకు ఉపాధిని కల్పించామని, ఇది దేశంలోనే రికార్డు అని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఏడాది 3వేల కోట్ల రూపాయల పనులు తెలంగాణ రాష్ట్రంలో జరిగాయన్నారు. గతంలో ఉపాధి హామీ పనులంటే అంతగా అభివృద్ధి కనిపించేది కాదన్నారు. నర్సరీలు, మొక్కల పెంపకం, చెరువుల పూడికతీత, ఇంకుడుగుంతలు, సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, వైకుంఠ దామాలు, ప్రకృతి వనాలు, డంపు యార్డులు, కల్లాలు, రైతు వేదికలు వంటి వెన్నో నిర్మిస్తున్నామని చెప్పారు. నిర్ణీత కాలానికి ముందే ఉపాధి హామీ పనులన్నీ పూర్తి చేసి, కొత్తగా మరిన్నిధుల కోసం

నిధులను కేంద్రాన్ని అడిగిన రాష్ట్రం కూడా మనదేనన్నారు. నిర్ణీత లక్ష్యాలకనుగుణంగా పని చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ రఘునందన్ రావు, ఉపాధి హామీ అధికారులు అందరినీ మంత్రి అభినందించారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ, కమిట్‌మెంట్ తో పని జరుగుతున్నది. గ్రామాల్లో పచ్చదనం పరుచుకుంటున్నది. సీజనల్ వ్యాధులు తగ్గాయి. గ్రామ పంచాయతీలకు క్రమం తప్పకుండా ప్రతి నెలా రూ.308 కోట్లు విడుదల చేస్తుండటంతో పనులు జరుగుతున్నాయి. ప్లలెప్రకృతి వనాలు అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాకు మరిన్ని నిధులు అందేలా చూడండని అన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు అద్భుతంగా సాగుతున్నాయి. గ్రామాల రూపురేఖలు మారాయి. సమర్థవంతంగా పనులు జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ డిపార్ట్ మెంట్ నుంచి గిరిజన సంక్షేమానికి రావాల్సిన నిధులను క్రమం తప్పకుండా అందించాలని కోరారు.

పోలీస్ గస్తీ వాహనం ఢీకొని బాలుడు మృతి

హైదరాబాద్, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): నగరంలోని పాతబస్తీలో బుధవారం మధ్యాహ్నం వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

మంగళ్‌హాట్ సీతారామ్‌బాగ్‌లో పోలీసు గస్తీ వాహనం ఢీకొని హర్షవర్ధన్ అనే బాలుడు మృతి చెందాడు. చాంద్రాయణగుట్టలో టిప్పర్ ఢీకొని మూడేళ్ల చిన్నారి మారుయం ప్రాణాలు కోల్పోయింది.

ఈ రెండు ఘటనలపై ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

కరోనాపై ప్రజల్లో విస్తృత ప్రచారం

రాష్ట్రాల సిఎస్‌లతో కేబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబ చర్చ

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): కోవిడ్ వ్యాధి పై అవగాహన కల్పించడానికి విస్తృత ప్రచారాన్ని నిర్వహించి, ప్రజల్లో మార్పు తీసుకు రావాలని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను కోరారు. గురువారం కేబినెట్ కార్యదర్శి కోవిడ్ పై వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్థిక కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కావడంతో పాటు పండుగ సీజన్, శీతాకాలం వస్తున్నందున కోవిడ్ నియంత్రణపై దృష్టిసారించాలని గౌబ ప్రధాన కార్యదర్శులను కోరారు. జన సమూహాలు లేకుండా చూడాలన్నారు. ప్రజల్లో టెస్టుల పట్ల ఉన్నభయాందోళనలను తొలగించి ఎక్కువ మంది టెస్టులు చేయించుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, వ్యక్తిగత పరి శుభ్రత తదితర అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వి, ప్రజారోగ్యశాఖ సంచాలకులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను వంచించిన కెసిఆర్

ఉద్యోగాలు వస్తాయనుకున్న వారికి నిరాశ
అన్ని రంగాల్లో ప్రభుత్వం వైఫల్యం: వంశీచంద్

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): నిధులు ,నీళ్లు, ,నియామకాలు మీద ఏర్పడిన తెలంగాణలో అవేవి నేరవేరడం లేదని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి తప్పుబట్టారు. ఉద్యోగాలు వస్తాయనుకున్న నిరుద్యోగులకు నిరాశ ఏర్పడిందన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. అన్ని రంగాల్లో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, కరోనా విషయంలో సర్కారు పూర్తి వైఫల్యం చెందిందని మండిపడ్డారు. పేదవారు సర్కారు దావఖానకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌తో దోచుకుంటోందని వంశీచంద్ రెడ్డి మండిపడ్డారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు పక్రియ ప్రారంభమైందని, పట్టభద్రులు ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, 2.70 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలు ఉన్న భర్తీ చేయడంలేదని దుయ్యబట్టారు. 6 ఏళ్లలో కేవలం 30వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని తప్పుబట్టారు. ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

కొండగట్టులో మళ్లీ వాహన పూజలకు అనుమతి

జగిత్యాల,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధానంలో గురువారం నుంచి నూతన వాహన పూజలు చేపట్టారు. ఇంతకాలం కరోనాతో వీటికి దూరంగా ఉన్న అధికారులు తాజాగా ఆదేశాలు చేయడంతో పలువురు తమ వాహనాలకు పూజలు చేసేందుకు ముందుకు వచ్చారు. వాహన పూజలకు అనుమతించాలని ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో దాదాపు 193 రోజుల తరవాత భక్తులకు నూతన వాహన పూజ కార్యక్రమం సేవలు అందుబాటులోకి వచ్చాయి. కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో ఆలయంలో భక్తులకు ప్రవేశం, వివిధ ఆర్జిత సేవలు రద్దు చేసిన విషయం తెలిసిందే. లాక్‌డౌన్ సడలింపులో భాగంగా జూన్ 8 నుంచి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తున్నారు. వాహనాల పూజలకు అనుమతి ఇవ్వలేదు. మొత్తానికి తదుపరి సడలింపులో భాగంగా అక్టోబరు 1వ తేదీ నుంచి నూతన వాహన పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ క్రమంలో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తుపాకి పేలి కానిస్టేబుల్‌కు గాయాలు

చిత్తూరు,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): శ్రీకాళహస్తి ఆలయంలో పొరపాటున తుపాకీ పేలి కానిస్టేబుల్ గాయపడ్డాడు. ఏఆర్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం బుధవారం రాత్రి అమ్మవారి గర్భాలయం వద్ద బందోబస్తు విధులు నిర్వహించాడు. గుడి మూసివేసే సమయంలో తుపాకీని గదిలో భద్రపరిచే క్రమంలో గన్‌కు ఉన్న బోల్ట్ వదులై పొరపాటున పేలింది. బుల్లెట్ పైకప్పుకు తగిలి పెచ్చులూడి పడటంతో సుబ్రహ్మణ్యం చెవి వద్ద స్వల్ప గాయమైంది. చికిత్స నిమిత్తం అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపారు. ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రుడు, ఏఆర్ డీఎస్పీ శివరామకిశోర్ ఘటనపై ఆరా తీశారు.

చెరువులో పడి ముగ్గురు చిన్నారుల దుర్మరణం

కన్నీరు మున్నీరయిన తల్లిదండ్రులు

మెదక్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): రెక్కాడితే గాని డొక్కాడని కూలీ కుటుంబాల కుటుంబాల్లో విషాదం నెలకొంది. ముగ్గురు చిన్నారుల మృత్యువాతతో ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి. చెరువు రూపంలో పేగు బంధాన్ని చిదిమేసింది. చెరువు ఆ చిన్నారుల పాలిట మృత్యు కూపమైంది. ఊరికి ఆదెరువుగా ఉండే చెరువు రెండు కుటుంబాల్లో మాత్రం తీరని వేదనను మిగిల్చింది. అభంశుభం తెలియని ముగ్గురు చిన్నారులను బలి తీసుకుంది. మాటల కందని ఈ హృదయవిదారక ఘటన జిల్లాలోని మనోహరాబాద్ మండలం దండుపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు ఆడుకుంటూ ఇంటి పక్కనే ఉన్న చెరువులోకి దిగారు. ఈత రకాపోవడంతో పిల్లలు అందులోనే జల సమాధి అయ్యారు. మరో ఇద్దరు చిన్నారులు ఈదుతూ ప్రాణాలతో బయటపడ్డారు. మృతులు పిట్టల వాడకు చెందిన రవి, నవీన్, అఖిలగా గుర్తించారు. మృతులంతా 10 ఏండ్ల వయసు లోపు వారే. పిల్లల మరణ వార్త విన్న తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వారి ఆర్త నాదాలు పలువురిని కంటతడి పెట్టించాయి. చిన్నారుల మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

గోదావరి నదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన జిల్లాలోని బాసర వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన రాజేశ్వర్ (56) ప్రమాదవశాత్తు బాసర వద్ద గోదావరి నదిలో పడి మృతి చెందాడని తెలిపారు. స్థానికుల సమాచారంతో పోలీసలు సంఘటన స్థలానికి చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భైంసా ఏరియా దవాఖానకు తరలించారు.

ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి: మాయావతి

లక్నో, అక్టోబర్ 1: ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించలేకపోతే సీఎం యోగి ఆదిత్యనాథ్ తన పదవికి రాజీనామా చేయాలని ఆమె అన్నారు.

హత్రాస్, బల్రాంపూర్‌లో మహిళలపై జరిగిన లైంగికదాడులపై మాయావతి మండిపడ్డారు. 'మహిళలకు రక్షణ కల్పించని పక్షంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలని నేను కోరుతున్నా. ఆయన నివాసమైన గోరఖ్‌నాథ్ మఠానికి కేంద్ర ప్రభుత్వం పంపాలి. ఆ ఆలయం ఆయనకు నచ్చకపోతే రామ మందిర నిర్మాణ పనిని అప్పగించాలి. ప్రజల క్షేమం కోసం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని నేను డిమాండ్ చేస్తున్నా' అని మాయావతి అన్నారు. సాంఘిక వ్యతిరేక శక్తులు రాష్ట్రాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్నాయని తాను భావిస్తున్నానని, రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని, చట్టాలను పాటించడం లేదని ఆమె మండిపడ్డారు.

స్వచ్ఛంద సేవకు.... యువకుల నీరాజనం ....

- కుమ్మరి చిన్న ఆధ్వర్యంలో..... వందల సంఖ్యలో టి.ఆర్.కె ట్రస్ట్ లో చేరిన యువకులు

నిస్వార్థంతో ప్రజలకు సేవ చేస్తున్న స్వచ్ఛంద సేవకు కుమ్మరి చిన్న ఆధ్వర్యంలో గురువారం యువకులు నీరాజనం పలికారు....

వేములవాడ, అక్టోబర్ 1 (నేటినిజం ప్రతినిధి):నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడిలా అండగా ఉంటూ పదిమందికి సేవ చేయాలనే ఉద్దేశంతో టి ఆర్ కే ట్రస్టును నెలకొల్పి వందల మందికి బాసటగా నిలిచిన ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్... ...గురువారం టి ఆర్ కే ట్రస్ట్ లో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు 300 మంది యువకులు కుమ్మరి చిన్న ఆధ్వర్యంలో చేరారు. ముందుగా వారు బైక్ లపై ర్యాలీగా టి ఆర్ కె ట్రస్ట్ కార్యాల యానికి తరలివచ్చి టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ కు భారీ గజమాలతో, పూలమాలలతో, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవ చేయడానికి వచ్చిన యువకులను ఉద్దేశించి ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ మాట్లాడుతూ యువకులు తమ సమయాన్ని వృధా చేయకుండా అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. అలాగే చిన్నప్పటి నుండే సేవాభావాన్ని అలవర్చుకొని మనం సంపాదించిన డబ్బుతో పేదలకు సహాయం చేయాలన్నారు. అనంతరం టి ఆర్ కే ట్రస్ట్ లో సేవకులుగా చేరేందుకు సభ్యత్వ నమోదు పత్రాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు కుమ్మరి శంకర్, మొట్టల మహేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్, సేవకులు పిల్లి సందీప్, సాయి, కళ్యాణ్, శ్రీకాంత్, ఇక్రారార్, టిల్లు రాజు, లక్ష్మి రాజాం, టి.ఆర్.కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌కు ఆత్మీయ సత్కారం

వేములవాడ, అక్టోబర్ 1 (నేటినిజం ప్రతినిధి): ప్రతిష్టాత్మక టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ కేంద్ర సలహామండలి సభ్యుడిగా నియమితులైన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ కు ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఆయన ఇద్దరు కుమారులు ఆత్మీయంగా సత్కరించారు. గురువారం హైదరాబాద్ లోని వినోద్ కుమార్ అధికారిక నివాసంలో గులాం అహ్మద్ హుస్సేన్, తన ఇద్దరు కుమారులు సయ్యద్ గులాం ఇస్మాయిల్ హుస్సేన్, సయ్యద్ గులాం నజీర్ హుస్సేన్ లు వినోద్ కుమార్ కు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం తో శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ వినోద్ కుమార్ కు ఏ పదవి వచ్చిన గర్వం లేకుండా బాధ్యతాయుతంగా పదవికి వన్నె తెచ్చే నాయకుడన్నారు. అందరిని కలుపుకుపోయే మనస్తత్వం ఉన్న గొప్ప నేత అని అన్నారు. జీవితంలో మరిన్ని ఉన్నత పదవులను అలంకరించాల ని ఆకాంక్షించారు.

స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేసిన ప్రిన్సిపాల్

వేములవాడ, అక్టోబర్ 1 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను ఆ కళాశాల ప్రిన్సిపాల్ సత్య వర్ధన్ రావు అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశం పొందిన 180 విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా అందజేసినట్లు ఆయన తెలిపారు . ఇంటర్ మొదటి , రెండో సంవత్సరం విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ఆన్లైన్ క్లాసెస్ జరుగుతున్న స్టూడెంట్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు .ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంజయ్య ,భరత్ ,అశోక్ ,సంతోష్, రవీందర్ , రాము , లత, మంగ పాల్గొన్నారు

స్వచ్ఛంద సేవకు తరలివస్తున్న మహిళలు...

- సేవకుడికి సన్మానాలు, సత్కారాలు.....

వేములవాడ, అక్టోబర్ 1 (నేటినిజం ప్రతినిధి):ప్రజలకు సేవ చేసేందుకు నెలకొల్పిన టి ఆర్ కే ట్రస్టుకు ప్రతిరోజు మహిళలు సేవకులుగా చేరేందుకుగురువారం వేములవాడ లోని పలు వార్డుల నుంచి మహిళలు, అనుపురం గ్రామం నుండి బుడిగ జంగాల సేవకులు స్వచ్ఛందంగా సేవ చేసేందుకు టి ఆర్ కే ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ ఆధ్వర్యంలో ట్రస్ట్ లో చేరారు. ఈ సందర్భంగా వారికి సభ్యత్వ నమోదు పత్రం అందజేశారు. అనంతరం వైష్ణవి డిగ్రీ కళాశాల గీతా విద్యా సంస్థల నిర్వాహకులు ఆయాచితుల జితేందర్, పలువురు ఉపాధ్యాయులు టి.ఆర్.కె ను శాలువాతో, పూలమాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంల